క్లుప్తంగా

బాలల పరిరక్షణ కరపత్రాల ఆవిష్కరణ



ఎల్కతుర్తి : మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బాలల పరిరక్షణ కరపత్రాలను జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్ శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాలల పరిరక్షణ కోసం గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. పల్లెలను బాల్యవివాహ రహిత గ్రామాలుగా నిలపాలని, పేద బాలలు సంక్షేమ, గురుకుల పాఠశాలలను వినియోగించుకోవాలని కోరారు. జిల్లా సంక్షేమ అధికారి సబిత మాట్లాడుతూ జిల్లా, మండల, గ్రామస్థాయిల్లో బాలల పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మేకల స్వప్న, తహసీల్దార్ గుజ్జుల రవీందర్‌రెడ్డి, ఎంపీడీఓ తూర్పాటి సునీత, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు దామోదర్‌రెడ్డి, బాలల పరిరక్షణ అధికారి ప్రవీణ్‌కుమార్, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ రాగి కృష్ణమూర్తి, సోషల్ వర్కర్ సునీత, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతులను ఆదుకోవాలి



ఆత్మకూరు : ఇటీవల కురిసిన వడగండ్ల వానలకు పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కమలాపురం రమేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న పంటలను శుక్రవారం ఆయన సందర్శించి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల మండలంలోని మొక్కజొన్న, వరి రైతులు భారీగా పంటలు నష్టపోయారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే వ్యవసాయ శాఖ అధికారులు సర్వే చేయించి నష్టాన్ని అంచనా వేసి బాధిత రైతులకు ఎకరాకు రూ.20 వేలు చొప్పున పరిహారం చెల్లించాలని కోరారు. రైతులను ఆదుకునేలా పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్మిస్తామని చెప్పారు.

రేపు ఆరాధనోత్సవాలు

హన్మకొండ కల్చరల్: నగరంలోని భద్రకాళి రోడ్డులోని విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, శివాలయం, గాయత్రీమాత ఆలయంలో ఆదివారం ఉదయం ఆరాధనోత్సవాలు నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ అధ్యక్షుడు మారోజు సదానందచారి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో హిమాలయ యోగి సంత్ సదానందగిరి స్వామి మహారాజ్ విశిష్ట అతిథిగా పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా వీనస్



హసన్‌పర్తి: ఇండియా పెంతెకొస్త సంఘం తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా భీమారానికి చెందిన పెండ్యాల వీనస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల ఎల్కతుర్తి మండలం ఇందిరానగర్‌లో జరిగిన ఎన్నికలకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 150 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

రేపు కన్యకా పరమేశ్వరి జయంతి శోభాయాత్ర

వరంగల్ చౌరస్తా: ఈనెల 30న వాసవీమాత కన్యకా పరమేశ్వరి జయంతి సందర్భంగా శోభాయాత్ర నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్ తెలిపారు. వరంగల్ పాత బీటుబజారులో ఆర్యవైశ్య మిత్ర బృందం ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 13 ఏళ్లుగా వాసవీమాత జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి శోభాయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి నాగేంద్రబాబు, ఉపాధ్యక్షుడు ఇమ్మడి శ్యాంబాబు, శ్రీనివాస్, పుల్లూరి రవి బాబు, నమఃశివాయ, పరమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ మాలధారులకు అన్నదానం

కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గలోని రంగనాథ స్వామి ఆలయంలో హనుమాన్ మాలధారులకు శుక్రవారం అన్నదానం చేశారు. ముఖ్యఅతిథిగా వరంగల్ ప్రెస్ క్లబ్ జాయింట్ సెక్రటరీ బూర్ల నరేందర్ హాజరై భోజనం వడ్డించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వంగరి రవి, చిలుపూరి సురేష్, సమ్మయ్య, భాస్కర్, రవికుమార్, రోజా, సృజన, జర్నలిస్టులు సూర్యప్రకాష్, ఉపేందర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

● అధికారులపై సర్పంచ్‌ల మండిపాటు



అధికారులను నిలదీస్తున్న ప్రజాప్రతినిధులు

ఎల్కతుర్తి : మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది. ఎంపీపీ మేకల స్వప్న అధ్యక్షత వహించగా తొలుత ఆయా శాఖల అధికారులు నివేదిక చదివి వినిపించారు. సూరారంలో తాగునీటి పైప్‌లైన్ వేసి మూడేళ్లు గడుస్తున్నా ఇంకా డబ్బు చెల్లించలేదని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈపై సర్పంచ్ కుర్ర సాంబమూర్తి మండిపడ్డారు. అప్పు చేసి అభివృద్ధి పనులు చేస్తే బిల్లులు చెల్లించడం లేదని గోపాల్‌పూర్ సర్పంచ్ మాసిపెద్ది భాస్కర్‌రావు ధ్వజమెత్తారు. మిషన్ భగీరథ, ఈజీఎస్ కింద చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు రాలేదని, బిల్లులు చేయకుండా గ్రామ కార్యదర్శులు ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. మండలంలోని ఇందిరానగర్, చింతలపల్లి, ఎల్కతుర్తి శివార్లకు సరిహద్దులు చూపించాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు సంబంధిత రెవెన్యూ అధికారులను కోరారు. గ్రామాల సరిహద్దుల్లో వెంచర్లు వెలుస్తున్నా చర్యలు తీసుకోవడం లేదని ఇందిరానగర్, చింతలపల్లి సర్పంచ్‌లు తెలిపారు. అప్పు చేసి అభివృద్ధి పనులు చేసినా మండలంలో ఏ ఒక్క గ్రామానికి కూడా ఉత్తమ పంచాయతీగా అవార్డు రాలేదంటూ జెడ్పీ చైర్మన్‌ను గోపాల్‌పూర్ సర్పంచ్ భాస్కర్‌రావు నిలదీశారు. స్థానిక బస్టాండ్‌లో మరుగుదొడ్లు నిర్మించినా ఎందుకు ప్రారంభించడం లేదని సంబంధిత అధికారిని ప్రజాప్రతినిధులు నిలదీశారు. ఉపాధి కూలీలు చేసిన పనులకు అధికారులు డబ్బులు చెల్లించడం లేదని సర్పంచ్‌లు తెలిపారు. ఉపాధి హామీ పనులను వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని, కూలీల కొరతను అధిగమించాలని కోరుతూ సభలో వైస్ ఎంపీపీ తంగెడ నగేష్ తీర్మానం చేశారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్

దార్శనికుడు సీఎం కేసీఆర్ : చైర్మన్

ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవడం కోసం ఎకరానికి రూ.10 వేలు చొప్పున పరిహారం అందజేస్తున్న గొప్ప దార్శనికుడిగా సీఎం కేసీఆర్‌ను జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్ అభివర్ణించారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై వివక్ష పాటిస్తోందని విమర్శించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు సీఎం నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. సమావేశంలో ఎంపీడీఓ తూర్పాటి సునీత, తహసీల్దార్ గుజ్జుల రవీందర్‌రెడ్డి, సీడీపీఓ సబిత, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలతో భరోసా



ఐనవోలు : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైస్ చైర్మన్ శ్రీరాములు



దామెరలో ప్రారంభిస్తున్న ఎంపీపీ శంకర్, తదితరులు

ఐనవోలు : పల్లెల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు భరోసా కల్పిస్తోందని జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు తెలిపారు. మండలంలోని పంథిని, పున్నేలు గ్రామాల్లో నందనం సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన మొత్తం ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వం క్వింటా 'ఏ' గ్రేడ్ ధాన్యానికి రూ.2,060, 'బీ' గ్రేడ్ ధాన్యానికి రూ.2,040 చెల్లిస్తోందని చెప్పారు. వెంకటాపూర్‌లో సొసైటీ వైస్ చైర్మన్ తక్కళ్లపెల్లి చందర్‌రావు, కొండపర్తి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తుండగా వైస్ ఎంపీపీ తంపుల మోహన్ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకుని లబ్ధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు వడిచర్ల శ్రీనివాస్, సంపత్‌రావు, మేట చిరంజీవి, పద్మ కుమారస్వామి, పూజారి రామచంద్రం, చింత బాబు, సర్పంచ్ కరిముళ్ల ప్రేమలత, కత్తి దేవేందర్, కట్కూరి రాజమణి, ఎంపీటీసీ చాట్ల అరుణ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

దామెర : రైతుల సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ కాగితాల శంకర్ తెలిపారు. మండలంలోని పసరగొండలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పల్లెల్లో రైతులు ధాన్యం కోతలు మొదలుపెట్టిన క్రమంలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని చెప్పారు. రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించొద్దని సూచించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మేడిపల్లి సాంబయ్య, వైస్ ఎంపీపీ జాకిర్ అలీ, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము, పీఏసీఎస్ చైర్మన్ బొల్లు రాజు, దళితబంధు చైర్మన్ గరిగె కృష్ణమూర్తి, ఏపీఎం ఝాన్సీ, నాయకులు మల్లయ్య పాల్గొన్నారు.

హామీల అమలులో కేసీఆర్ విఫలం

● ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి రవి



మాట్లాడుతున్న గాదగోని రవి

పరకాల : ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో సీఎం కేసీఆర్ విఫలమయ్యారని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి విమర్శించారు. పేదలకు నివాస స్థలాల కోసం ఆ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం గుడిసెవాసులు, కళాకారులు భారీ నిరసనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ జగన్మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆర్‌ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన ఆ పార్టీ డివిజన్ కమిటీ సమావేశానికి జిల్లా కార్యదర్శి నీల రవీందర్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా గాదెగోని రవి హాజరై మాట్లాడారు. తెలంగాణ ఏర్పడితే కూడు, గూడు లభిస్తుందనే ఆశతో లక్షలాది మంది కళాకారులు, గుడిసెవాసులు ప్రాణాలకు తెగించి ఉద్యమించారని తెలిపారు. వందలాది మంది ప్రాణత్యాగాలతో గద్దెనెక్కిన సీఎం కేసీఆర్ ప్రజలను విస్మరించారని మండిపడ్డారు. ప్రభుత్వ భూములను కబ్జాల బారి నుంచి కాపాడడంతోపాటు పేదలకు స్థలాలిప్పించేందుకు భూపోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని అర్హులైన పేదలకు పంచి పెట్టి చిత్తశుద్ధి చాటుకోవాలని బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి హితవు పలికారు. రాష్ట్రంలో పేదలకు, కళాకారులకు సొంత స్థలాలు, ఇండ్లు ఉండాలనే మాటకు కట్టుబడి ఉండాలని సీఎం కేసీఆర్‌ను కోరారు. ఇప్పటికే పేదల స్వాధీనంలో భూములన్నింటికి జీఓ నంబర్ 58, 59 ప్రకారం పట్టాలిస్తామన్న మాటను నిలబెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎన్‌రెడ్డి, హంసారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు పరికిరాల భూమయ్య, కర్ర రాజిరెడ్డి, మాసు సావిత్రి, గడ్డం నాగార్జున, పార్టీ సకల కళా సంస్కృతిక కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం సుధాకర్, జిల్లా అధ్యక్షుడు నీలం కుమార్, జిల్లా కమిటీ సభ్యులు తక్కళ్లపల్లి బాపురావు, కోసం బుచ్చయ్య, కిషన్, భద్రయ్య, తిరుపతి, రమేష్, రజిత, సమ్మక్క, ఉప్పయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ మేళా



కమలాపూర్ : మండలంలోని కమలాపూర్, కన్నూరు, దేశరాజుపల్లి, భీంపల్లి, గుండేడు, పంగిడిపల్లి, ఉప్పల్, కానిపర్తి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం ప్రీస్కూల్ మేళాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రుల సమక్షంలో చిన్నారులతో పాటలు పాడించి కథలు చదివించారు. చిన్నారులకు అసెస్మెంట్ కార్డులను అందజేశారు. ప్రీస్కూల్‌కు సంబంధించిన మెటీరియల్‌ను ప్రదర్శించారు. కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లు పద్మ, పద్మకుమారి, శ్రీలత, ఉమ, కవిత, శోభ, సులోచన, వరలక్ష్మి, కుమారి, శ్రీలత, చామంతి, సువార్త, జ్యోతి, రజిత తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ డ్రైవర్‌కు రెండేళ్ల జైలు

శాయంపేట : రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మరణానికి కారకుడైన టిప్పర్ డ్రైవర్ బయగాని సాంబయ్యకు రెండేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ పరకాల మేజిస్ట్రేట్ లింగం శాలినీ తీర్పు ఇచ్చినట్లు ఎస్సై ఇమ్మడి వీరభద్రరావు తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. 2015 అక్టోబర్ 20న ప్రగతి సింగారం గ్రామానికి చెందిన బయగాని సాంబయ్య తన టిప్పర్‌ను మందారిపేట నుంచి గూడెప్పాడ్ వైపు అతివేగంగా అజాగ్రత్తగా నడుపుకుంటూ వస్తూ కొత్తగట్టు సింగారం స్టేజీ వద్దకు ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న మునుకుంట్ల కిరణ్, వద్లూరి ప్రేమ్‌సాగర్ మృతి చెందాడు. ఈ ఘటనపై శాయంపేట పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని విచారణ చేసి కోర్టుకు ఫైల్ సమర్పించారు. ఈ కేసును పరకాల మెజిస్ట్రేట్ విచారించారు. సాంబయ్యకు రెండేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. కేసులో సాక్షులను విచారించడంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రుధిక, కుమార్‌ను, సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టడంలో సమర్థవంతంగా వ్యవహరించి నిందితుడికి శిక్ష పడేలా విధులు నిర్వర్తించిన కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస ప్రసాద్, ఏసీపీ శివరామయ్య, రూరల్ సీఐ శ్రీనివాసరావు, ఎస్సై ఇమ్మడి వీరభద్రరావులను పరకాల జడ్జి అభినందించారు.

రేపటి సభను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రవి, తదితరులు

ఆత్మకూరు : ఈనెల 30న హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌లో తలపెట్టిన స్వరాజ్య పాదయాత్ర బహిరంగ సభను విజయవంతం చేయాలని దళిత శక్తి ప్రోగ్రామ్ (డీఎస్పీ) మండల అధ్యక్షుడు మైదం రవి కోరారు. ఆ కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను మండల కేంద్రంలో శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. అనంతరం రవి మాట్లాడారు. రాష్ట్రంలోని 3 కోట్ల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల రాజ్యస్థాపన కోసం విశారదన్ మహారాజ్ 10 వేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్ర చేపట్టారని తెలిపారు. ఐక్య ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారమౌతాయని స్పష్టం చేశారు. సభకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు భారీ సంఖ్యలో తరలిరావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు చిలువేరు రాజు, నాయకులు అశోక్, రాజ్‌కుమార్, లింగమూర్తి, రాము, చింటు తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి డ్రాయింగ్‌లో శిక్షణ తరగతులు

వరంగల్ స్పోర్ట్స్: సాగంటి ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో డ్రాయింగ్, పెయింటింగ్‌లో మే 1నుంచి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు అకాడమీ ఫౌండర్ సాగంటి మంజుల శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 81436 43337 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు. అలాగే, హనుమకొండలోని సర్క్యూట్ హౌస్ రోడ్డులోని కన్నా చెస్ అకాడమీలో చదరంగంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు అకాడమీ చీఫ్ కన్నా తెలిపారు. వివరాలకు 90595 22986 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రైతులకు పరిహారం చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, తదితరులు

దామెర : గతేడాది వర్షాలకు పంటలు నష్టపోయిన మండలంలోని తక్కళ్లపహాడ్ గ్రామ రైతులకు అక్కడి రైతు వేదికలో పరిహారం చెక్కులను ఎంపీపీ కాగితాల శంకర్ శుక్రవారం పంపిణీ చేసి మాట్లాడారు. బాధిత రైతులందరికీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ అండగా ఉంటున్నట్లు తెలిపారు. రైతులకు అండగా నిలవడంలో సీఎం ముందుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జాకిర్ అలీ, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము, దళితబంధు చైర్మన్ గరిగె కృష్ణమూర్తి, పీఏసీఎస్ చైర్మన్ బొల్లు రాజు, సర్పంచ్‌లు బింగి రాజేందర్, వడ్డెపల్లి శ్రీనివాస్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ దాడి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ అడ్మిషన్ల సంఖ్య పెంచాలి



రిజిస్ట్రార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్ల సంఖ్యను పెంచాలని, ఇంటర్వ్యూలో మార్కుల వెయిటేజ్ ఇవ్వాలని కాకతీయ యూనివర్సిటీ జేఏసీ చైర్మన్ డాక్టర్ తీగల ప్రేమ్‌సుందర్, బాధ్యులు కోరారు. ఈమేరకు కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాసరావును శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. యూజీసీ నిబంధనల ప్రకారం ప్రతి ఆరునెలలకోసారి పీహెచ్‌డీలో ప్రవేశాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని పేర్కొన్నారు. సీనియర్ ప్రొఫెసర్లు, రిటైర్డ్ ప్రొఫెసర్లకు 10 మంది చొప్పున పరిశోధకులను కేటాయించాలని సూచించారు. యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల లెక్చరర్లకు కూడా గైడ్‌షిప్ ఇవ్వాలని నిర్ణయించినందున ఒక్కొక్కరికి నలుగురి చొప్పున పరిశోధకులను కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో కేయూ జేఏసీ బాధ్యులు వడ్డెపెల్లి మధు, కందికొండ తిరుపతి, నిమ్మల సోమరాజ్, తదితరులు పాల్గొన్నారు.

50 మందికి ఉద్యోగ అవకాశాలు



కేయూ క్యాంపస్: జెన్‌పాక్ట్ కంపెనీ ఆధ్వర్యంలో హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో 50మంది కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభించాయని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య తెలిపారు. తొలుత 30మందికి ఆన్‌లైన్ ద్వారా ఉద్యోగ పత్రాలు అందజేస్తారని, ఆ తరువాత మరో 20మందికి అందజేయనున్నట్లు వెల్లడించారు. జాబ్‌మేళాలో జెన్‌పాక్ట్ కంపెనీ న్యూఢిల్లీ ప్రతినిధులు సాంసన్, చేతన్, ప్రతిపాల్, హరీష్, సాకేత్, రాఘవ, ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ కనకయ్య, డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం



గుడిసెవాసులతో మాట్లాడుతన్న వినయ్‌భాస్కర్

రామన్నపేట: పేదల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. పశ్చిమ నియోజవర్గ పరిధిలోని 11, 29వ డివిజన్లలో అధికారులతో కలిసి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో గుడిసెవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ నంబర్ 58 ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే వరంగల్‌లోని పోతననగర్, రఘునాథ్‌కాలనీ, ఓఎస్‌నగర్‌లలోనూ పర్యటించారు. కార్యక్రమాల్లో 11వ డివిజన్ కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి ఆర్డీఓ వాసుచంద్ర, మహేందర్, తహసీల్దార్ సత్యపాల్‌రెడ్డి, కల్పలత సూపర్‌బజార్ వైస్ చైర్మన్ ఎండీ.షఫి తదితరులు పాల్గొన్నారు.

ధరిత్రి వారోత్సవాల ముగింపు




మృత్తికతో చేతిముద్రలు వేసి ప్రదర్శిస్తున్న ప్రేరణ ఫౌండేషన్ సభ్యులు, వాకర్స్

హన్మకొండ: ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రేరణ ఫౌండేషన్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వారోత్సవాలు శుక్రవారం ముగిశాయం. ఈ సందర్భంగా బాలసముద్రంలోని ఏకశిలా పార్క్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రేరణ ఫౌండేషన్ అధ్యక్షుడు పెండ్లి ఉపేందర్‌రెడ్డి మాట్లాడారు. జన్మనిచ్చిన తల్లి కన్నా ఆ తల్లిని మోస్తున్న జన్మభూమి గొప్పదని తెలిపారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతీఒక్కరిపైనా ఉందని స్పష్టం చేశారు. ప్లాస్టిక్ వినియోగాన్ని అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా మానేయాలని సూచించారు. మొక్కలను విరివిగా నాటి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. అనంతరం, మృత్తికతో చేతిముద్రలు వేసి సంతకాలు చేసి వాటిని ప్రదర్శిస్తూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సామాజిక వేత్త నిమ్మల శ్రీనివాస్, ఏకశిల వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు పి.ఎల్లాగౌడ్, దశరథ రామ్‌రెడ్డి, ప్రొఫెసర్ సుధాకర్, తిరుమలరావు, ప్రేరణ ఫౌండేషన్ సభ్యులు బూర రాంచందర్, సంపత్, స్వర్ణలత, సునీల్, శోభ, శ్రీలత పాల్గొన్నారు.

నేడు అండర్ రైల్వేజోన్‌లో నీటి సరఫరా బంద్

వరంగల్ అర్బన్: ధర్మసాగర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కారణంగా అండర్ రైల్వేజోన్ ప్రాంతాల్లో శనివారం నీటి సరఫరా ఉండదని బల్దియా ఈఈ రామోజు శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయం కారణంగా ధర్మసాగర్ 60 ఎంఎల్‌డీ నుంచి నీటి విడుదల నిలిచిపోయి కరీమాబాద్, శివనగర్, రంగశాయిపేట, శంభునిపేట, తిమ్మాపూర్, సింగారం, మామునూరు, బొల్లికుంట, శాకరాశికుంట, ఎస్‌ఆర్‌ఆర్‌తోట, ఏకశిలనగర్, కాశికుంట, ఖిలా వరంగల్, దూపకుంట, వసంతపురం, స్తంభంపల్లి, నక్కలపెల్లి, లక్ష్మీపురం, భట్టుపల్లి, కడిపికొండ, రాంపూర్, మడికొండ ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదని వివరించారు.

డాక్టర్ నరేష్‌కుమార్‌కు ఐకాన్ హెల్త్‌కేర్ అవార్డు



ఖిలా వరంగల్: వైద్య రంగంలో రాణిస్తూ ప్రజలు, వైద్య విద్యార్థులకు విశేషమైన వైద్య సేవలందిస్తున్నందుకు వరంగల్ ఫోర్ట్‌రోడ్డుకు చెందిన సన్‌షైన్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ వేములపల్లి నరేష్‌కుమార్.. ఐకాన్ హెల్త్‌కేర్ అవార్డు–2023ను అందుకున్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని జయహర్ష కాన్వెన్షన్ హాల్‌లో మెడిక్స్ డిజిటల్ హెల్త్ బ్యాంక్ ఆధ్వర్యంలో హెల్త్‌కేర్ రీఫామ్ డాక్టర్స్ అసోసియేషన్ నేతృత్వంలో గురువారం రాత్రి అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి వేణుగోపాల్‌రావు, రాష్ట్ర కార్యదర్శి అజయ్ మిశ్రా నుంచి అవార్డును నరేష్ అందుకున్నారు.

ఆయుర్వేదంతో సంపూర్ణ ఆరోగ్యం

కాజీపేట అర్బన్: ఆయుర్వేదంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని గ్రేటర్ వరంగల్ పరిధిలోని 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు అన్నారు. హనుమకొండ న్యూశాయంపేటలోని పద్మశాలి పరపతి సంఘం భవన ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ ఆయుర్వేదిక్ హాస్పిటల్ ఉచిత మెడికల్ క్యాంపును ఆయన ప్రారంభించారు. వైద్య పరీక్షలు చేయించుకున్న నిరుపేదలకు ఉచిత మందులను అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ అనిశెట్టి శ్రీధర్, కేదారి శ్వేత, కవిత, మాజీ కార్పొరేటర్ మాడిశెట్టి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మకు ప్రత్యేక పూజలు

మామునూరు: వరంగల్ సత్యసాయినగర్‌లోని సమతానగర్ కాలనీలోని పోచమ్మ దేవాలయంలో అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ పూజారి రామకృష్ణశర్మ, ఆలయ కమిటీ ప్రతినిధి శ్రీనివాసగుప్తా ఆధ్వర్యంలో పోచమ్మకు అభిషేకాలు, అర్చనలు చేశారు. ముఖ్యఅతిథిగా శంభునిపేట, విశ్వనాథకాలనీల అధ్యక్షుడు కర్నె రవీందర్ హాజరై పోచమ్మను దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో రామానుజన్, జగదీశ్వర్ స్వామి, నాగబండి శ్రీనివాస్ గుప్తా, రాంబాబు, తరగల శ్రీధర్, రాజేశ్వర్‌రావు, భిక్షపతి పాల్గొన్నారు.

ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళి

హన్మకొండ చౌరస్తా: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) 100వ జయంతి సందర్భంగా హనుమకొండ రాగన్నదర్వాజ సమీపంలోని ఆయన చిత్రపటానికి పలువురు రాజకీయ నాయకులు పూలమాలలు వేసి శుక్రవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు చీకటి రాజు మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన దివంగత సీఎం ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నాయకులు మట్ట శ్రీనివాస్‌రెడ్డి, దుంపల రమేష్, తత్తరి హన్మంతు, ఆంజనేయులు, సారంగం, భాషబాయ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.